www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 19 ఆగస్టు 2025
5
వైఎస్ఆర్



పాఠశాల విలీనాన్ని ఆపాలని విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

చాపాడు మండలం, చియ్యపాడు గ్రామం, ఎస్సి కాలనీలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న పాఠశాలను మోడల్ స్కూల్ పేరుతో వేరే చోటికి మార్చొద్దంటూ విద్యార్థులకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విలీనం వల్ల చాలా ఇబ్బందులు ఉన్నాయని, కాలనీ స్కూల్ తమకే ఉండాలని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్ల కత్తిరింపు



జిల్లాలో వికలాంగ పింఛన్లకు భారీగా కోతపడింది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత బోగస్ వికలాంగ పింఛన్ల ఏరివేతపై దృష్టి సారించింది. జిల్లాలోని వేలా మంది వికలాంగ పింఛనుదారులకు రీ అసెస్మెంట్ పరీక్షల నిర్వహణకు కసరత్తు చేసింది. తొమ్మిది నెలల వ్యవధిలో రెండు దఫాలుగా వికలాంగ పింఛను రీఅసెస్మెంట్ పరీక్షలు నిర్వహించింది. తాజాగా 7,182 మంది వికలాంగ పింఛనుదారులు అనర్హులుగా తేల్చింది. సచివాలయాలు, ఎంపిడిఒ కార్యాలయాల నుంచి పెద్దఎత్తున నోటీసులు జారీ చేసింది. వీరికితోడు మరో 1,585 మందిని వికలత్వ శాతం తగ్గిన వారిగా గుర్తించి ఒఎపి పింఛనుదారులుగా మార్పు చేసింది. ఫలితంగా సెప్టెంబర్ ఒకటిన పింఛన్ చెల్లింపుల కోత, భారీగా చెల్లింపులు నిలిపేయనుండడం ఆందోళన కలిగి స్తోంది.

- 7,182 మందికి నోటీసులు జారీ
- మరో 6,500 మందికి కోత?!
- అత్యధికంగా కడప అర్బన్‌లో 456

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 37 వేల మంది వికలాంగ పింఛనుదారులు ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం అన్నమయ్య జిల్లాలో బోగస్ పింఛన్లపై ఆరోపణలు రావడంతో మదనపల్లికి చెందిన వైద్యుల పర్యవేక్షణలో రీ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించింది. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా సదరీ సర్టిఫికెట్లతో పెద్దఎత్తున బోగస్ పింఛన్ పొందుతు న్నట్టు భావించింది. జిల్లాలోని 30 వేల మందికి పైగా రీ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించింది. 2024 నవంబర్ నుంచి 2025 జులై వరకు జిల్లా అధికార యంత్రాంగం కడప జిజిహెచ్, ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి, పులివెందుల ఏరియా ప్రభుత్వాస్పత్రుల్లో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన వైద్యుల పర్యవేక్షణలో రీఅసెస్మెంట్ పరీక్షలు నిర్వహించింది. అనంతరం వైద్య నిపుణుల అందించిన పరీక్షల ఫలితాలను ప్రభుత్వానికి అందజేసింది.

7,182 వికలాంగులకు పెన్షన్ నిలిపివేత

జిల్లాలోని వికలాంగులకు నిర్వహించిన రీఅసెస్మెంట్ పరీక్షల్లో 7,182 మందిని అనర్హులుగా తేల్చింది. 5,173 మంది వికలాంగులు, బెడెడ్ రోగులు 74 మంది, తాత్కాలిక వికలాంగ సర్టిఫికెట్‌దారులు 1,889 మంది, తాత్కాలిక సర్టిఫికెట్లు కలిగిన రోగులు 46 మంది చొప్పున 7,182 మంది అనర్హులుగా గుర్తించింది. వీరిలో 40 శాతం నుంచి 85 శాతం లోపు వికలత్వం కలిగిన ఉన్న 60 ఏళ్ల వయస్సు కలిగిన వారికి పింఛన్ మొత్తాన్ని తగ్గింపు చర్యలు తీసుకుంది. 40 శాతంలోపు వికలత్వం కలిగిన 60 ఏళ్ల లోబడిన వికలాంగులన అనర్హులుగా తేల్చి, పింఛన్ చెల్లింపులను నిలిపేయనుంది.

మరో 6,500 మందికి కోత?

జిల్లాలోని 7,182 మంది వికలాంగ పింఛన్‌దారులకు పెద్ద ఎత్తున నోటీసులు జారీ చేసింది. జిల్లాలోని 37 వేల మందిలో రీ అసెస్మెంట్ పరీక్షలకు గైర్హాజరైన మరో ఏడు వేల మంది రీఅసెస్మెంట్ పరీక్షలకు గైర్హాజరు కావడంతో పరీక్షలను నిలిపేసింది. సుమారు ఏడు వేల మంది రీఅసెస్మెంట్ గైర్హాజర్లలో 1,400 మందికి మాత్రమే చెల్లింపులు చేయనుంది. ఈలెక్కన మిగిలిన 6,600 పింఛన్ నిలుపుదల చేయ నుంది. ఈలెక్కన వికలాంగ పెన్షన్ అనర్హుల వివరాలను లెక్కిస్తే 14,182 మంది వికలాంగ పెన్షన్‌దారులకు మొండిచేయి చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


సెప్టెంబర్ చెల్లింపుల్లో కోత!

ఆరోగ్య పరిస్థితుల కేటగిరీ పరిధిలోని వికలాంగులు 408 మంది, 40 శాతంపైన 60 ఏళ్ల వయస్సు కలిగిన 1,177 మందిని ఒఎపి పింఛనుదారులుగా మార్చింది. ఈలెక్కన జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య పరిస్థితుల వికలాంగ కేటగిరీ, ఆరోగ్య పరిస్థితుల సాధారణ రోగుల కేటగిరీ పరిధిలో సుమారు 1,585 మందిని ఓఏపి పింఛన్ దారులుగా పరిగణించనుంది. ఆమేరకు పింఛన్ చెల్లింపుల్లో కోత వేయనుంది.

వైకల్యం తక్కువగా ఉందని నోటీసులు
- ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తున్న బాధితులు

ప్రజాశక్తి - చాపాడు

ఎన్‌టిఆర్ భరోసా ద్వారా విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న పింఛన్లలో కోత విధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2025 ఫిబ్రవరి నుంచి సదరం సర్టిఫికెట్లను పునఃపరిశీలించి వైకల్యంలో 40 శాతం తక్కువగా ఉన్న వారిని గుర్తించి పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. గతంలో ఎప్పటి నుంచో పింఛను పొందుతూ ఉన్న వారికి కూడా తొలగిస్తున్నట్టు నోటీసులు ఇవ్వడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కొంతమంది పునఃపరిశీలనకు వెళ్లని కారణంగా పింఛను దూరం కానున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక పెన్షన్ల పంపిణీలో కోత విధించేందుకు పలు రకాలుగా ప్రయత్నాలు చేపడుతుంతి. పలు దఫాలుగా తనిఖీల పేరుతో పింఛన్లను ప్రతినెలా కొన్ని తగ్గించే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగా ప్రస్తుతం వెల్ఫేర్ అసిస్టెంట్లు విభిన్న ప్రతిభావంతుల పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. కొంతమందికి రూ.15వేలు పెన్షన్ నుండి రూ. 6వేలు, రూ. 4వేలకు మార్పు చేస్తున్నట్లు నోటీసులు అందజేశారు. చాపాడు మండలంలోని అన్నవరంలో 14, బద్రిపల్లెలో 30, అయ్యవారిపల్లెలో 8, ఎన్ ఓబాయపల్లెలో 26, చాపాడులో 12, అన్నవరంలో 14, పెద్దగురువలూరులో 4, చిన్న గురువలూరులో 30 మిగిలిన గ్రామాల్లో 120 , మొత్తం మండల వ్యాప్తంగా 250కి పైగా పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. కొంతమందికి ఈనెలలో నగదు పంపిణీ చేయకుండా కోత విధించినట్లు తెలిసింది. నోటీసులు జారీ చేసిన వారికి సెప్టెంబర్‌లో పింఛను పంపిణీ ఉండదని తెలియజేశారు. పక్షవాతం సోకి మంచానికే పరిమితమైన వారికి కూడా పింఛన్లు కోత విధంచడంతో తమకు ప్రభుత్వం చాలా అన్యాయం చేస్తుందని వాపోతున్నారు. అధికారులు పునఃపరిశీలించి అర్హులైన వారికి పింఛన్లలో కోత విధించకుండా చూడాలని కోరుతున్నారు.



పక్షవాతంతో బాధపడుతున్న ప్రకాశం, పింఛను తొలగిస్తున్నట్లు అందించిన నోటీసు

అనర్హత వేటు వేయడం దారుణం



ప్రభుత్వం వికలాంగ పింఛన్‌కు అనర్హత సాకు చూపించడం దారుణం. గతంలో రూ.ఆరు వేల పింఛన్ ఇచ్చి, ఇప్పుడు అనర్హత పేరుతో పింఛన్ తొలగించడం అన్యాయం.

- రావలూరు సావిత్రమ్మ, సోమాపురం, చాపాడు.

హామీల అమలుకు కృషి చేయాలి
- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేయాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి యుటిఎఫ్ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. సోమవారం ఉదయం యుటిఎఫ్ నేతలు పులివెందులలో ఎమ్మెల్సీని ఆయన గృహంలో కలిసి విద్యారంగం, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలను ఇచ్చిందన్నారు. కూటమి పెద్దలు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరించారన్నారు. ప్రభుత్వం కొలువై ఏడాదికాలం దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టిసారించలేదన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ఆరు నెలల్లోగా చెల్లిస్తామన్న ప్రభుత్వం కేవలం రూ. 6 కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. ఇంకా 20వేల కోట్లకు పైగా బకాయిలు చెల్లింపులకు నోచుకోలేదన్నారు. 12వ పిఆర్‌సి అమలులో తీవ్ర జాప్యం జరుగుతుందని పేర్కొన్నారు. తక్షణం పిఆర్‌సి కమిషన్ నియమించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన అసెస్మెంట్ బుక్లెట్ విధానం వల్ల ఉపాధ్యాయుల బోధనకు తీవ్ర ఇబ్బందికరంగా ఉన్నదన్నారు. విద్యార్థుల స్థాయికి మించిన ప్రశ్నాపత్రం, పరీక్షల నిర్వహణ విధానం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆర్థిక సమస్యల వల్ల సమస్యల పరిష్కారం జాప్యం జరుగుతుందని, ముఖ్యమంత్రితో, విద్యాశాఖ మంత్రి తో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏ.డి.దేవదత్తం, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, డిఆర్ఒ, డిఎంహెచ్ఒ

హెచ్‌ఐవి, మాదకద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజలలో హెచ్‌ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులు, మాదక ద్రవ్యాలు అవగాహనా కల్పించేందుకు 8 వారాల పాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికపై 'నిర్లక్ష్యం చేయవద్దు మరొక్కసారి గుర్తు చేసుకోండి" అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఉన్న ఆరోగ్య శాఖా సిబ్బంది, లింక్ వర్కర్ స్కీం, స్వచ్ఛంద సేవ సంస్థలు సహకారంతో జిల్లాలోని కళాశాలలు, ఎన్‌ఎస్-ఎస్, ఎన్‌సిసి, స్కూల్స్, లైన్ డిపార్ట్మెంట్స్‌కు ప్రతి గ్రామానికి వెళ్లి హెచ్‌ఐవి. పరీక్ష, సుఖ వ్యాధులు, కండోమ్, టోల్ ఫ్రీ నెంబర్ 1097, హెచ్‌ఐవి పై అపోహల పై ర్యాలీలు నిర్వహిస్తారని తెలిపారు. దేశవ్యాప్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. జనాభాలో హెచ్‌ఐవి, సుఖవ్యాధుల గురించి పరిజ్ఞానం, అవగాహన పొందించడానికి, కార్యక్రమాల్ని చేపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెసి అతిథిసింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టిబి అధికారి డాక్టర్ రవి బాబు, జడ్పి సిఇఒ, క్లస్టర్ ప్రోగ్రామే మేనేజర్ భాస్కర్, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, స్వచ్ఛంద సంస్థలు, అబ్దుల్ సాదిక్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వ విద్యాలయంలోని భూ విజ్ఞానశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న ఎన్.జయరాజుకు యూకెలోని స్కాట్లాండ్ సెయింట్ ఆండ్రూస్ యూనివర్శిటీ, నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈయన ఈ నెల 19 నుంచి 22 వరకు నిర్వహించే సదస్సులో 'భారతదేశ తూర్పు తీరంలోని కొన్ని ప్రాంతాల నుంచి సముద్ర కాలుష్యాన్ని విశ్లేషించడానికి మలస్కన్ షెల్స్ వినియోగం' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నారు. ప్రొఫెసర్ ఎన్. జయరాజు గతంలో 70 దేశాలలోని అంతర్జాతీయ సదస్సులలో పత్రసమర్పణ చేశారు. ఈయన భూ విజ్ఞానశాస్త్రంపై రాసిన వ్యాసాలు పలు జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఆయనకు అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందడం పట్ల వైవీయూ విసి ఆచార్య అల్లం శ్రీనివాస రావు, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనిసాస్, భూ విజ్ఞానశాస్త్ర అధ్యాపకులు ఆచార్య రఘు బాబు, ఆచార్య సునీత, సహ ఆచార్యులు శ్రీనివాస గౌడ్, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

శిక్షణ కార్యక్రమాల రూపకల్పనలో కీలకం

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్‌ఆర్‌ఎం కళాశాల, ప్రూడెంట్ స్మార్ట్ సొల్యూషన్స్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం వ్యవసాయ రంగంలో ప్రాజెక్టులు, పరిశోధనలు, ఇంటర్న్‌షిప్‌లు, శిక్షణ కార్యక్రమాల రూపకల్పనలో కీలకపాత్ర పోషిస్తుందని కళాశాల ఎమ్‌డి డాక్టర్ చంద్ర ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒఎంయు ద్వారా ప్రూడెంట్ స్మార్ట్ సొల్యూషన్స్ విద్యార్థులకు ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించడమే కాకుండా, వ్యవసాయ ప్రాజెక్టుల అమలు కోసం సహకారం, మార్గదర్శకత్వం కూడా అందించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల అమలు పద్ధతి, నాణ్యత ప్రమాణాలు, ఖర్చులు వంటి అంశాలు దశలవారీగా తుది నిర్ణయం తీసుకోబడతాయని చెప్పారు. కెఎస్‌ఆర్‌ఎం. కళాశాల విద్యార్థి బృందాలకు విభాగ మెంటర్లను కేటాయించి, నిర్దిష్ట కాలవ్యవధిలో ప్రాజెక్టులు పూర్తి చేయడానికి సహకరిస్తుందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. ఎన్.ప్రసాద్, కళాశాల ఒయు విభాగాధిపతి ప్రొఫెసర్ వి. గిరిధర్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం. వెంకట నారాయణ, ఐక్యూ ఏసి డీన్ డాక్టర్ విజయ కిషోర్ పాల్గొన్నారు.



అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న చంద్ర ఓబుల్‌రెడ్డి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి అరెస్టు దుర్మార్గం

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్పొరేట్ల కోసం బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కరేడు ప్రజలు చేస్తున్న 50వ రోజు నిరసనకు సంఘీభావంగా రైతులు, ప్రజా సంస్థలు 'చలో కరేడు' కార్యక్రమానికి పిలుపు నిచ్చాయని, ఈ పిలుపులో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును అరెస్టు చేయడం అక్రమమని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం చలో కరేడు కార్యక్రమానికి వెళడానికి వీలులేదని పోలీసులు కొంత మంది నాయకులను హౌస్ అరెస్టు చేశారని పేర్కొన్నారు. దీనిని నిరోధించడానికి ప్రభుత్వం సెక్షన్ 30, 144 విధించి, గ్రామాన్ని మూసివేయడం ద్వారా ప్రయత్నించిందని తెలిపారు. నిరసన చేస్తున్న నాయకులను, కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఆంక్షలు ఉన్నప్పటికీ, నిరసనకారులు గ్రామస్తుల మద్దతు కోరుతూ స్థానిక శివాలయం సమీపంలో బహిరంగ సభ నిర్వహించాలని ప్రయత్నం చేశారని తెలిపారు. దీన్ని పోలీసులు అడ్డుకోవడం సరైంది కాదన్నారు. కరేడు గ్రామంలో సంవత్సరానికి మూడు పంటలు పండే భూములను అదానీ కార్పొరేట్ సంస్థ ఇండోసోల్ పరిశ్రమ కోసం ప్రభుత్వం చేపట్టిన బలవంత భూసేకరణను రద్దు చేయాలని రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. బలవంతపు భూసేకరణ రద్దు చేయాలని, అరెస్ట్ చేసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును, ఇతర నాయకులను తక్షణమే విడుదల చేయాలని పేర్కొన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపడం సాధ్యం కాదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని తెలిపారు.

29 వరకు ఆర్ట్స్ కళాశాలలో సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి - కడప

కడప ఆర్ట్స్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకల సందర్భంగా సాంస్కృతిక పోటీల నిర్వహణ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. 29న తెలుగు భాషా దినోత్సవ వేడుకలను నిర్వహణలో భాగంగా ఈనెల 18 నుంచి 28 వరకు కొన్ని సాంస్కృతిక అంశాల్లో పోటీలను నిర్వహించి, బహుమతులు అందించాలని తెలుగు శాఖ సంకల్పించిందని పేర్కొన్నారు. పోటీల్లో పద్యపఠనం (8-10 తరగతి, ఇంటర్, డిగ్రీ), ఏకపాత్రభినయం, ముగ్గుల పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కల్గిన వారు ఈనెల 19లోగా కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అర్జీదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తుందన్నారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, ఎస్‌డిసి వెంకటపతి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలి: ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఆయా పిర్యాదుల పై క్షేత్ర స్థాయిలో విచారించి శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం' నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన 149 మంది పిర్యాదుదారులతో ఎస్‌పి ముఖాముఖి మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, మహిళా పిఎస్ డిఎస్‌పి బాలస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు చేసింది ఏమీ లేదు : వైసిపి

ప్రజాశక్తి - కడప

స్త్రీ పథకంలో ఏదో ఒకటో రెండు బస్సులు పెట్టుకొని ఊదరగొత్తుకుంటున్నారు తప్ప మీరు ప్రజలకు చేసిందేమీ లేదని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపలో గండి వీరాంజనేయ స్వామి ఆఖరివారం కాబట్టి మహిళలందరూ దర్శనం కోసం ఫ్రీ బస్ ఉంది కదా అని వెళితే అక్కడి పోతే స్పెషల్ బస్ అని చెప్పి ప్రతి ఒక్కరి మహిళల దగ్గర టికెట్ డబ్బులు రాబట్టారన్నారు. ఈ వర్షాల వల్ల చాలామంది రైతులు పంట నష్టపోయారని, కూటమి ప్రభుత్వం ఒక్క రైతు నన్న ఆదుకుందా అని ఘాటుగా ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీలు ఇష్టం వచ్చినట్టు పెంచుకుంటూ పోతూ ప్రజలపై విపరీతమైన భారాలు సమావేశంలో పార్టీ నాయకులు యానదయ్య, పులి సునీల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

బీటెక్ విద్యార్థులకు యోగా

ప్రజాశక్తి- కడప అర్బన్



యోగాసనాలు చేస్తున్న డాక్టర్ రంగనాథరెడ్డి

ఫ్రెష్‌మెన్ ఇన్‌డక్షన్ కార్యక్రమంలో భాగంగా, విద్యార్థుల శారీరక, మానసిక, భావోద్వేగ స్థితిని తొలి రోజు నుంచే మెరుగు పరచే ఉద్దేశంతో విశ్రాంతిని కలిగించే యోగా సెషన్‌ను సోమ వారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. అతిథి యోగా శిక్షకులుగా మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఆర్. రంగనాథ్ రెడ్డి హాజరయ్యారు. వివిధ యోగా ఆసనాలు, శ్వాస వ్యాయామాలు, మైండ్‌ఫుల్నెస్, సాంకేతికతల ద్వారా విద్యార్థులను నడిపించారు. చదువులో విజయాన్ని సాధించడంలో, ఒత్తిడిని తగ్గించడంలో, ఏకాగ్రతను పెంపొందించడంలో ఎంతగానో ఉపయుక్తమని వివరించారు. కార్యక్రమంలో విభాగఅధిపతి డా. వి.రామచంద్రారెడ్డి, ప్రొఫెసర్‌బీ ఇండక్షన్ ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్లు డాక్టర్ రమేష్ బాబు, అసోసియేట్ ప్రొఫెసర్ మేరీ జాస్మిన్ , అసిస్టెంట్ ప్రొఫెసర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రక్త కొరతను అరికట్టండి

ప్రజాశక్తి-కడప అర్బన్

రక్తదానం చేసి రక్త కొరతను అరికట్టాలిని జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు పంద్రా రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామినాయుడు ఆదేశాల మేరకు కడప ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ప్రముఖ సినీ నటులు పద్మ విభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సోమవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి, తల సేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తం చాలా అవసరని పేర్కొన్నారు. ఇటువంటి ఆలోచనతోనే చిరంజీవి బ్లడ్ బ్యాంకును స్థాపించి అనేక మందికి రక్తం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో పోలదాసు నాగరాజు, బ్రహ్మం నాయక్, గౌస్ లాజం, బాలు నాయక్, చైతన్య, అతికారి నాగేంద్ర, కుమార్ నాయక్, సుధీర్, శ్రీను, వెంకట్, మల్లిఖార్జున, గోపాల్ నాయక్, సాయి నాయక్, విశాల్ దేవ్, రామ్ చరణ్, హర్షవర్ధన్, లోకేష్, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ యశస్విని రెడ్డి, సిబ్బంది స్వరూప రాణి, ప్రశాంతి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

వికలాంగులకు అన్యాయం చేస్తే ఆందోళన

ప్రజాశక్తి - కడప అర్బన్

అర్హులైన వికలాంగులకు పెన్షన్లలో అన్యాయం చేస్తే ఆందోళన చేస్తామని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చిన్న సుబ్బయ్య యాదవ్ హెచ్చరించారు. జిల్లాలో తొలగించిన 7,747 మంది వికలాంగుల పింఛన్లను పునః పరిశీలించాలనిసోమవారం జెసి అదితి సింగ్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ చిన్న సుబ్బయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అనర్హులుగా గుర్తించి పెన్షన్లు తొలగించిందని పేర్కొన్నారు. ఇందులో అర్హులైన వారు కూడా ఉన్నారని, వీరికి రీ వెరిఫికేషన్ నిర్వహించి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. నిజమైన వికలాంగులకు అన్యాయం జరిగితే రాష్ట్రం మొత్తం మీద మహా ధర్నాకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఎస్.బి.సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు డి.మాతయ్య, మైదుకూరు ఇన్‌ఛార్జి బి. ఓబయ్య, దువ్వూరు అంకిరెడ్డి రమణారెడ్డి, వికలాంగులు పాల్గొన్నారు.

లాటరీ పద్ధతిలో రెండు బార్లు కేటాయింపు

ప్రజాశక్తి - కడప

సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని పిజిఆర్ఎస్ హాల్‌లో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జిల్లాలోని రెండు బార్లను గీత కులముల వారికి లాటరీ పద్ధతి లో కేటాయించారు. కడప మున్సిపల్ కార్పోరేషను 'గౌడ' ఉపకులానికి, మున్సిపల్ 'ఈడిగ' ఉపకులమునకు లాటరీ ద్వారా కేటాయించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ జయరాజు, ఎక్సైజ్, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవి కుమార్, జిల్లా ఈడిగ సంఘం సెక్రటరీ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు.

22న 'కమనీయ కవితలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- కడప అర్బన్ : జిఎల్ లావణ్య కవిత్వీకరించిన 'కమనీయ కవితలు' అనే పుస్తకాన్ని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు కడప సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆవిష్కరిస్తున్నట్లు రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత జిల్లా సెషన్స్ న్యాయమూర్తి షేక్.మొహమ్మద్ ఇస్మాయిల్, విశిష్ట అతిథులుగా ప్రసిద్ధ వైద్యులు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథులుగా ఉమెన్స్ ప్రిన్సిపల్, కవి డాక్టర్ వి.సలీం బాషా, ఇంటాక్ కేంద్ర పాలకమండలి సభ్యులు, కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, భూమిరెడ్డి స్వరూపారాణి పాల్గొంటారని తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతే జీవన ప్రగతికి నాంది

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : ఆర్థిక అక్షరాస్యతే ప్రతి ఒక్కరి జీవన ప్రగతికి నాంది కావాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపల్ టి.ఉమామహేశ్వరుడు పిలుపునిచ్చారు. తమ కళాశాలలో సోమవారం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో గురుకులంలో సైబర్ క్రైమ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏపీజీబీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ డిపాజిటర్లకు అవగాహన లేకపోవడంతో రూ.67 వేల కోట్లు వదిలేశారని తెలిపారు. విద్యార్థులు సైబర్ క్రైమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. బ్యాంకులు తక్కువ ప్రీమియంతో అందిస్తున్న పలు రకాల బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బి.మఠం ఏపీజీబీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ షేక్ అక్బర్, హెర్డ్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, రాట సంస్థ కళాకారుల బృందం, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.ఉదయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న భూపేష్‌రెడ్డి

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం 26 మందికి రూ.8,92,029 చెక్కులను ఆ పార్టీ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిఎం సహాయనిధి బాధిత కుటుంబాలకు ఒక వరం అన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా పథకాలు అమలు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల్లో ఇప్పటికి 4 పథకాలను అమలు చేశారన్నారు. ఉచిత బస్సు ప్రయాణంలో చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్ద వాళ్ల వరకు ఉద్యోగం చేసే మహిళలు సైతం ఉచితంగా ప్రయాణించవచ్చు అన్నారు. ఎపిలో పథకాలు అమలు చేసినట్లు దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు కాలేదన్నారు. పథకాల అమలులో సిఎం చంద్రబాబుకే ఘనత దక్కుతుందని పేర్కొన్నారు. వైసిపి మీడియా ఉచిత ప్రయాణంపై అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నేతలు ఎద్దుల శేషారెడ్డి, ఎలిమిఆర్ భాస్కర్‌రెడ్డి, గొటూరు నాగభూషణం, వేణుగోపాల్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, మేస్త్రి రమణ, ఎంవి రమణ, శంకర్, హర్షద్, శివ పాల్గొన్నారు.


దీపానికి దిక్కులేని శ్రీకొండా సింగరాయ స్వామి గుడి

దేవుడికి దానం.. కబ్జాదారుల గాలం..!

రూ.కోట్లు విలువ చేసే దేవుడి ఆస్తులు ఆక్రమణదారుల చేతుల్లో..!

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

బ్రహ్మంగారిమఠం మండలంలోని శ్రీకొండా సింగరాయ స్వామికి సంబంధించిన రూ.కోట్ల ఆస్తులు గల భూములు ఆక్రమణదారుల చేతుల్లో మిగిలి పోతున్నాయి. రూ.కోట్ల ఆస్తులున్న స్వామికి దీపం పెట్టే దిక్కే లేకుండా ఊరి బయట శిథిలావస్థలో ఉంది. ఆ గుడిని పట్టించుకునేవారే లేరు. ప్రభుత్వం ఆస్తులు కాపాడేందుకు ప్రత్యేకంగా ఇఒను ఏర్పాటు చేసినా ఉపయోగం లేదు. వచ్చామా నెల నెల జీతాలు తీసుకున్నామా.. వెళ్లామా అనే రీతిలోనే అధికారులు ఉంటున్నారని ఆరోపణలున్నాయి. అనేక సందర్భాల్లో ప్రభుత్వం కోట్లు చేసుకుంది.. దేవుని భూములను ప్రభుత్వం ఆధీనంలోకి తెచ్చుకుంటుందని అనుకున్నా చివరకు నిరాశ మిగిలింది. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప.. దేవుని మాన్యాలు, ఆస్తుల పరిరక్షణలో విఫలమవుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దేవుని మాన్యాలు, ఆస్తులపై ప్రత్యేకదృష్టి పెట్టి రూ.కోట్లు విలువచేసే భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో, అవి ఎవరు ఆక్రమణలో ఉన్నాయో విచారించి స్వాధీనం చేసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల చెంత.. మురుగుతో చింత

ప్రజాశక్తి - ఖాజీపేట

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత.. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి అంటూ అధికారులు పదేపదే చెప్పే మాటలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోలేకపోతున్నాయి. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ సర్వరాజుపేట ప్రాథమిక ఉర్దూ పాఠశాల వద్ద మురుగు పెద్ద ఎత్తున నిలువచేరి ఉంటోంది. పాఠశాలకు వెళ్లే వీధి లోతట్టు మయంగా మారడంతో వర్షానికి నీరు అంతా రోడ్డుపైకి వచ్చి నిల్వ చేరుతోంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగునీరు నిలువ చేరి ఉండడం వల్ల దుర్వాసనతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు బయటికి వెళ్లేందుకు తగిన డ్రెయినేజీ వ్యవస్థ కూడా లేకపోవడంతో సమస్యగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారడంతో అంటువ్యాధులు సోకే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టి, సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ఉర్దూ పాఠశాల వద్ద నిల్వచేరిన మురుగు


ప్రొద్దుటూరు జెవివి నూతన కమిటీ సభ్యులు

జెవివి ప్రొద్దుటూరు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక ప్రొద్దుటూరు కమిటీని ఆదివారం నందిని క్లాత్ మార్కెట్‌లోని జెవివి కార్యాలయంలో జరిగిన మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా వేంపల్లి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నంగా రాజేష్, కోశాధికారిగా డాక్టర్ కె.చక్రధర్, సమతా కన్వీనర్‌గా ఎస్.రాజ్యలక్ష్మిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పి.ఉషారాణి, జెటి.ఈశ్వరయ్య, డాక్టర్ దస్తగిరి, ప్రసన్నకుమార్, హేమంత్, గఫార్, కార్యదర్శులుగా సునీత, బాలసుందర్, మహేష్, మహిత, అయినింపు, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ డి.నరసింహారెడ్డి, గౌరవ సలహాదారులుగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, డాక్టర్ పివి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా 29 మందిని, ప్యాట్రన్స్‌గా ముగ్గురిని, విద్య, ఆరోగ్యం, పర్యావరణం, పబ్లికేషన్స్ చెకుముకి సబ్ కమిటీ కన్వీనర్లను కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్య, ఆరోగ్యం, పర్యావరణ రంగాల్లో కృషిని పెంచుతామన్నారు. సమాజంలో శాస్త్రీయ దృక్ఫథాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

శాస్త్రవేత్తల సూచనల మేరకే యూరియా వాడాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్


ధర్మాపురం రైతులతో మాట్లాడుతున్న ఆర్డిఓ సాయిశ్రీ

వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన మోతాదు మేరకే తమ పంటలకు యూరియాను వాడాలని జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిశ్రీ రైతులకు సూచించారు. ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎఒ కార్యాలయాన్ని సోమ వారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ధర్మా పురం గ్రామ రైతులతో పంటల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లా డుతూ రైతులకు యూరియాను వ్యవసాయ సేవా కేంద్రాల ద్వారా అందిం చనున్నట్లు తెలిపారు. వ్యవసాయ సేవ కేంద్రాలలో ఉన్న విఎఎలకు ఎన్ని యూరియా ప్యాకెట్స్ కావాలో తెలియజేస్తే ఆ మేరకు పంపిణీ చేస్తారన్నారు. అధిక మోతాదులో పంట పొలాలకు యూరియాను ఉపయోగిస్తే పురుగు, తెగుళ్లు ఆశిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎఒ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు నవీన్ పాల్గొన్నారు.

రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ ఖాజామొహిద్దీన్

ప్రజాశక్తి - వేంపల్లె

వాతావరణ మార్పుల వల్ల రోగాలు సోకే ప్రమాదం ఉందని, వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ ఖాజామొద్దీన్ పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం శ్రీరాంనగర్ నగర్‌లో అపరిశుభ్రతగా ఉన్న డ్రెయి నేజీ కాలువలను ఖాజా మొద్దీన్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి డాక్టర్ వెంకటరెడ్డి పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలకు రోగాలపై అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలు చేపట్టే లార్వా సర్వే, ఫీవర్ సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖాజామొద్దీన్ మాట్లాడుతూ దోమ కాటుక గురి కాకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారి రక్తపుతలను సేకరించాలన్నారు. వారానికి రెండు సార్లు ల్యాబ్‌కు పంపాలని సూచించారు. మలేరియా వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే చికిత్స చేయాలన్నారు. మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామంలో ఫీవర్, లార్వా సర్వే చేయాలని ఆదేశించారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తల దగ్గర టార్చ్‌లైట్‌తో లార్వాను తప్పనిసరిగా గుర్తించాలని తెలిపారు. దోమల నివారణకు పైపెనోత్రిన్ పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సుభాషిణి, నిహారిక, సునీత, సుశాంతి, మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా, ఫకృద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్


వినతిపత్రమిస్తున్న నాయకులు

పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణగా కంచె ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ పట్టణ ఉపా ధ్యక్షులు సుబహాన్ కోరారు. ఆ మేరకు సోమవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుబహాన్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణంలోని బాలాజీ స్కూల్ వద్ద, తాడిపత్రి రోడ్డు ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఆటో స్టాండ్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వీటికి రక్షణ కంచె లేకపోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రదేశాలలో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. కేవలం ఆయా రెండు చోట్ల మాత్రమే కాదని, పట్టణంలో చాలా చోట్ల ఇలాంటి పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు చేసి, ఇలాంటి వాటికి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమాదాలు జరగకముందే స్పందించి సమస్యను పరిష్కరిస్తారని తాము కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సుదర్శన్, సురేష్ పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం


రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రమిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మండలంలో విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రంపల్లి అజయ్ మాట్లాడుతూ నరసన పల్లి ఎంపిపి పాఠశాలలో గత ప్రభుత్వంలో పాఠశాల అభివృద్ధిలో భాగంగా నాడు-నేడు పనులు ప్రారంచించారు. కొద్దిపాటి పనులు చేసి, ప్రహరీ కట్టని కారణంగా ఆవరణలో వర్షపు నీరు చేరి విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. సోమిరెడ్డిపల్లి ఎంపిపి పాఠశాల పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. మండలంలో ఉన్న పలు విద్యారంగ సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, రాజశేఖర్, ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.


ప్రభుదాస్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం, అనుబంధ సంఘాల నాయకులు

సిపిఎం నాయకులు మనోహర్‌కు పితృవియోగం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్ తండ్రి బి.ప్రభుదాస్(85) సోమవారం తెల్లవారుజామున వయోభారంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుదాస్‌కు నలుగురు పిల్లలు. మొదటి కుమారుడు జమ్మలమడుగు కోర్టులో లాయర్, రెండవ కుమారుడు ఆర్‌టిసి డ్రైవర్, మూడవ కుమారుడు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులుగా పనిచేస్తున్నారు. కుమార్తెకు వివాహమైంది. ఆమె గృహిణిగా ఉంటున్నారు. జమ్మలమడుగు మండలం పి.బొమ్మేపల్లె గ్రామంలో ప్రభుదాస్ పార్థివదేహాన్ని ఉంచారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్, రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీదేవి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ, సిఐటియు జిల్లా నాయకులు చంద్రారెడ్డి, సిపిఎం నాయకులు నారాయణ రెడ్డి, సిఐటియు నాగేంద్ర, జమ్మలమడుగు సిపిఎం కార్యదర్శి ఏసుదాసు, సిఐటియు ఉపాధ్యక్షుడు వినయ్, శేఖర్, అంగన్వాడీ నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి, సంజీవ పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖాజీపేట : నాగసానిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నాగసానిపల్లె ఫీడర్, జయరాంపేట ఫీడర్ మరమ్మత్తుల పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ ఇంజినీర్ నాగరాజు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 వరకు సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.

నేతాజీకి ఘన నివాళులు

ఖాజీపేట : ఆజాద్ హిందు ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని వివిధ రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ గున్నం పాటి వెంకట రమణ, కాంగ్రెస్ మైనారిటీ నాయకులు షేక్ హాజీగౌస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - చాపాడు


మృతి చెందిన సునీల్‌కుమార్

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై మండల పరిధిలోని బద్రిపల్లె రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతవరం గ్రామానికి చెందిన యల్లనూరు సునీల్ కుమార్(26) దుర్మరణం చెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మృతుడు మైదుకూరుకు నుంచి గ్రామానికి తిరిగి వెళ్లే సమయంలో బద్రిపల్లె దగ్గర బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, రోడ్డుకు ఆవతలి వైపు పడ్డాడు. అదే సమయంలో ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు వైపు వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సునీల్‌కుమార్ తండ్రి ఓబయ్య అల్లాడుపల్లె రోడ్డు వద్ద టీ స్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి వివాహం కాలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్


మృతి చెందిన పవన్‌కుమార్

పొలం పనులకు వెళ్లి విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి చెందిన దుర్ఘటన స్థానిక పోరుమామిళ్ల రోడ్డు పొలాల్లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైదుకూరుకు చెందిన రాటాల పవన్‌కుమార్ (38) ఎర్రచెరువు వద్ద పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పొలంలోని మోటరు వేస్తుండగా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించిన తోటి రైతులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

9 మోటర్ సైకిళ్లు స్వాధీనం : డిఎస్‌పి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఐదుమంది అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వర రావు తెలిపారు. జమ్మలమడుగు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు పట్టణానికి చెందిన అచ్చుకట్ల అబ్దుల్ రజాక్, షేక్ గైబుసావల్లి, వినుకొండ నాయబ్ రసూల్, వనం రామ్‌చరణ్, షేక్ పెద్ద మస్తాన్ అనే దొంగలను అరెస్టు చేసి, వారి నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ దాదాపు రూ.పది లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. ఆ వాహనాల యజమానుల వివరాలు తెలియ రావాల్సి ఉందన్నారు. నిందితులను జమ్మలమడుగు కోర్టు ఎదుట హాజరు పరుస్తామన్నారు. ఈ సందర్భంగా రికవరీ చేసిన అర్బన్ సీఐ ఎస్.లింగప్ప, మహిళా ఎస్ఐ హైమావతి, హెడ్ కానిస్టేబుల్ దేవదాసు, కానిస్టేబుల్స్ నాగేంద్ర, రియాజు, శివ, అంజిని డిఎస్‌పి అభినందించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

బాధ్యతలు స్వీకరించిన సిఐ నరేష్‌బాబు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐగా పి.నరేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ లింగప్ప గత సంవత్సరం ఆగస్టు 18న బాధ్యతలు చేపట్టగా, మళ్లీ అదే తేదీన బదిలీ కావడం విశేషం. లింగప్ప బదిలీ తర్వాత ఎర్ర గుంట్ల నుంచి జమ్మలమడుగు నరేష్‌బాబు వచ్చారు. సిఐకి సిబ్బంది స్వాగతం పలికారు. బదిలీపై వెళుతున్న లింగప్ప కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ ట్యాంకులను శుభ్రపరిచే వారేరీ..!

- మాజీ ఎంపిపి గోగుల కొండయ్య

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటిని అందించే వాటర్ ట్యాంకులను శుభ్ర పరచడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ వేసే నాథుడే కరువయ్యారని మాజీ ఎంపిపి గోగుల కొండయ్య పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ వేసేవారని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, కూటమి నేతలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వేంపల్లెలో కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను గాయపరుస్తున్నాయని కూటమి నేతలు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు.

గ్రీవెన్స్ ద్వారా 'అన్నదాత' పథకానికి దరఖాస్తులు

ముద్దనూరు : అర్హులై ఉండి అన్నదాత సుఖీభవ పథకం వర్తించని రైతులు ఈనెల 20లోపు గ్రీవెన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రామమోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు బ్యాంకులో ఆధార్ కార్డు లింక్ చేసుకొని ఎన్ పిసిఐ యాక్టివ్‌లో ఉండాలన్నారు. సంబంధిత బ్యాంకులో సంప్రదించాలని వారు సూచించారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - ముద్దనూరు

వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు తప్పకుండా పోలీసు, విద్యుత్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అనుమతితో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు పాటించకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రేపు శ్రీవరసిద్ధి వినాయక వార్షికోత్సవం

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు కేసి కెనాల్ గట్టుమీద వెలసిన శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం 20వ వార్షికోత్సవాన్ని ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం పలు పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సాయికృప ప్రథమ చికిత్స ఆలయంలో సోమవారం కిమ్స్ సవేరా హాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎక్కువ సంఖ్యలో గుండె చెకప్‌కు రోగులు హాజరయ్యారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ నితీష్‌కుమార్ రోగులకు చికిత్స చేశారు. 150 మంది 2డి చెకప్, ఈసీజీ చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపి వైద్యులు ఉల్లికళ్ల నారాయణ, కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE COURT : PRODDATUR

O.S.No. 147/2024

కె. ప్రవీణ్, W/o కె. సునీల్ కుమార్, లింగయ్య, డోర్‌నెం. 3/505-1, పార్క్ రోడ్, వైఎమ్ఆర్ కాలని, ప్రొద్దుటూరు మండలం, కడప జిల్లా. ...వాది

Vs

బండారు సురేంద్ర గుప్త, S/o బి.పుల్లయ్య, డోర్ నెం.3/815, 3/876, ఫోర్త్ ఫ్లోర్, శ్రీ ఎన్‌క్లేవ్, అరవింద ఆశ్రమం రోడ్డు, వైఎమ్ఆర్ కాలని, ప్రొద్దుటూరు మండలం, కడప జిల్లా. ...ప్రతివాది

పత్రికా ప్రకటన

పై నెంబరు దావాను వాది, ప్రతివాది అయిన మీ పైన ప్రామిసరి నోట్ మొత్తం రికవరి కొరకు రాజశ్రీ పై కోర్టు నందు దాఖలు చేసినారు. అట్టి దావా యందు మీరు రాజశ్రీ కోర్టు వారి సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా తేది 14.10.25వ తేదీన పై కోర్టు యందు వాయిదా ఉన్నది. కావున పై కోర్టు నందు ఉదయం 10.30 గం॥ మీరు హాజరై పై తెలిపిన కోర్టు నందు హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు కాని, మీ వకీలు ద్వారా కాని తెలుపవచ్చు. లేనంతట మీకు పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేదీ: 14.10.2025

//By Order of the Court//

G. RAJESH REDDY, B.A.,L.L.B.,
Advocate,
PRODDATUR.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE COURT : PRODDATUR

O.S.No. 146/2024

కె. జయలక్ష్మి, ... కె.మదుకుమార్ లింగయ్య, వయస్సు 46, డోర్ నెం.3/528-3-1, వైఎమ్ఆర్ కాలని, ప్రొద్దుటూరు మండలం, కడప జిల్లా. ...వాది

Vs

బండారు సురేంద్ర గుప్త, S/o బి.పుల్లయ్య, డోర్ నెం.3/815, 3/876, ఫోర్త్ ఫ్లోర్, శ్రీ ఎన్‌క్లేవ్, అరవింద ఆశ్రమం రోడ్డు, వైఎమ్ఆర్ కాలని, ప్రొద్దుటూరు మండలం, కడప జిల్లా. ...ప్రతివాది

పత్రికా ప్రకటన

పై నెంబరు దావాను వాది, ప్రతివాది అయిన మీ పైన ప్రామిసరి నోట్ మొత్తం రికవరి కొరకు రాజశ్రీ పై కోర్టు నందు దాఖలు చేసినారు. అట్టి దావా యందు మీరు రాజశ్రీ కోర్టు వారి సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా తేది 08.9.25వ తేదీన పై కోర్టు యందు వాయిదా ఉన్నది. కావున పై కోర్టు నందు ఉదయం 10.30 గం॥ మీరు హాజరై పై తెలిపిన కోర్టు నందు హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు కాని, మీ వకీలు ద్వారా కాని తెలుపవచ్చు. లేనంతట మీకు పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేదీ: 08.9.2025

//By Order of the Court//

G. RAJESH REDDY, B.A.,L.L.B.,
Advocate,
PRODDATUR.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : జమ్మలమడుగు

O.S.No. 181/2023

బుడతం రెడ్డి హైమావతి అలియాస్ చెంచు హైమావతి భర్త బుడతం రెడ్డి రమణారెడ్డి, తండ్రి చెంచు చిన్న వెంకట రామిరెడ్డి. డోర్. నెంబర్ 1/19, కె. రామిరెడ్డి పల్లె గ్రామం, ఏటూరు పోస్ట్, ఆర్.ఎస్. కొండాపూరం మండలం, కడప జిల్లా. ...వాది

వర్సెస్

చెంచు మౌనిక తండ్రి చెంచు వెంకటరెడ్డి (లేట్) ప్లాట్ నెంబర్ 121, డోర్ నెంబర్ 7- 781/2, సుభాష్ నగర్ కుతుబుల్లాపూర్, ఐ.డి.ఏ. జీడిమెట్ల, కె.వి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్రం. ప్రస్తుత చిరునామా కె. రామిరెడ్డి పల్లె గ్రామం, ఏటూరు పోస్ట్, ఆర్.ఎస్ కొండాపురం మండలం, కడపజిల్లా. ...ప్రతివాది నెం.3

దావా సమను

పైన పేర్కొన్న వాది, ప్రతివాది నెం. 3 అయినా మీ పైన బాగపరిష్కారాల దావా దాఖలు చేసినారు. కాబట్టి మీ హాజరు కొరకు పైకోర్టులో 22.08.2025న వాయిదా ఉన్నది. అట్టి దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల ఆ తేదీన పైకోర్టులో ఉదయం 10:30 గంటలకు హాజరై తెలుపుకొనవచ్చును.లేనంతట మీకు పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ: 22.08.2025

//బై ది ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//

కె. మహమ్మద్ సయ్యద్
వాది తరపు న్యాయవాది,
జమ్మలమడుగు.

BEFORE THE COMMISSIONER FOR WORKMEN COMPENSATION-CUM-ASSISTANT COMMISSIONER OF LABOUR, RAJAMPET

W.C. No. 1/2025

1. Yangalreddygari Anuradha, W/o Late Y. Venkata Reddy, aged about 38 years, Hindu, House wife
2. Yangalreddygari Vishnu Vardhan Reddy, S/o Late Y. Venkata Reddy, aged about 14 years, Hindu, Student, Minor
3. Yangalreddygari Likhith Kumar Reddy, S/o Late Y. Venkata Reddy,
aged about 11 years, Hindu, Student, Minor. Applicant nos. 1 & 2 being minors are represented by their natural guardian mother, who is the 1st applicant herein. All are resident of Bommepalli Village, Jammalamadugu Mandal, Kadapa District.. ...Applicants

Vs

1. Kandula Venkata Siva Rama Krishna Reddy, S/o Venkata Subba Reddy, aged 43 years, Hindu, Electrical Contractor, maintenance of Sub Station and Line maintenance, resident of Salivendula Village, Jammalamadugu Mandal, Kadapa District. ...Opposite Party No.1

The applicants filed the petition in the above matter against you, if you have got any objection you may appear before this Hon'ble Commissioner at 10.30 A.M on or before 30-08-2025, either in person or through an Advocate and file your objection, if you failed to do so, the matter will be decided exparte.

E.V. SUDHAKAR REDDY,
S. NOORULLAH,
Advocates,
Proddatur, Kadapa District.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE'S COURT: KADAPA.

E.P.No.315/2024 IN
O.S.No.320/2019

Taluri Venkatamma, W/o T. Prabhakar, Aged 57 years, R/at D.No:16/1199-1, Masapet Area, Kadapa City, Y.S.R. Kadapa District. ...D.Hr.

Vs

S. Nagaraju, S/o S.Nagaiah, having died his L.R's
1) S. Krishnaveni, W/o Late S. Nagaraju, Aged about 46 years,
2) S. Sivamma, D/o Late S. Nagaraju, Aged about 29 years,
3) S. Naga Lakshmi, D/o Late S. Nagaraju, Aged about 25 years,
4) S. Manikanta, S/o Late S. Nagaraju, Aged about 23 years,
All are R/at D.No.N-20/406, Ganjikunta Colony, Kadapa City, Y.S.R. District. ...J.Drs.

పత్రికా ముఖంగా సమన్లు

పై డిక్రీ హోల్డర్ తన డిక్రీ బాకీ వసూలు నిమిత్తము పై J.Drs పైన E.P. దాఖలు చేసియున్నారు. పై J.Drs గారి తండ్రి లేట్ ఎస్.నాగరాజు గారి Earned Leave amount ఇంతకు మునుపే O.S.No.320/2019 in I.A.No.416/2019, Dt.08.04.2019 attachment అయ్యివుంది. పై Amount send for చెయ్యమని ప్రస్తుత E.P. వెయ్యడం జరిగింది. పై E.P. లో పైన తెలిపిన J.Drs పైన కనపరచిన కోర్టు నందు హాజరు అగుటకు గాను వాయిదా ఉన్నది. కావున సదరు 04.09.2025వ తేదీన ఉదయం 10.30 నిమిషములకు మీరు అందరూ స్వయంగా కానీ, వకీలు ద్వారా కాని హాజరై మీ అందరి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

జి. త్రివిక్రమ్ సింగ్,
అడ్వకేట్,
కడప. సెల్: 9866790979.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KADAPA

E.P. No.270/2016
O.S.No.379/2011

G. Naga Subba Reddy S/o G. Rama Subba Reddy, Hindu, aged about 60 years, employee, residing at M.I.G.H.No.15-31-2M-56-5/6, 3rd Phase, Kokatpalli, Rangareddy District. ...Petitioner/D.Hr.

Vs

1. P. Sreenivasulu having died his L.Rs.
2. P. Nirmala W/o Late P. Sreenivasulu, Hindu, aged about 54 years, Home maker, residing at D.No.4/33, Dovaantharampalli, Gollapalli Post, Ontimitta Mandal, Kadapa District.
3. P. Ashok S/o Late P. Sreenivasulu, Hindu, aged about 32 years, residing at D.No.4/33, Dovaantharampalli, Gollapalli Post, Ontimitta Mandal, Kadapa District.
4. P. Shiva S/o Late P. Sreenivasulu, Hindu, aged about 29 years, residing at D.No.4/33, Dovaantharampalli, Gollapalli Post, Ontimitta Mandal, Kadapa District.

...Respondents/J.Drs.

నోటీసు

పై E.P./పిటిషన్ నందు D.Hr. EP Schedule దాఖలు ఆస్తి వేలం వేయుటకు గాను EP పిటీషన్ దాఖలు చేసియున్నారు. పై రాజశ్రీ కోర్టు వారి ఆదేశం మేరకు రెస్పాండెంట్/J.Dr. వారసులు అయిన మీకు క్రింద కనబరిచిన ఆస్తిని వేలం వేయుటకు గాను 22.08.2025వ తేదీన వాయిదా యుంటుయున్నది. కావున మీరు 22.08.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు మీరు స్వయ ముగా గానీ, వకీలు ద్వారా గాని మీ ఆక్షేపణలు తెలియజేయ గలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

SCHEDULE

Kadapa District, Kadapa Sub District, Kadapa Municipal Corporation area, Sionpuram D.No.3/1378 and 3/1379 in S.No.274/1 of Nagarajupalli Village fields in an extent of Ac.0.03 cents, bounded by,
East: House of Aparajana, West: House of K. Veera Narasimha Raju, North: Public Road. South: House of third parties,
Measurements:- East-West: 20 feet, North-South: 40 feet. Total extent of site and house 145.2 Sq. Yards.

//By Order of the Court//

T.MOHAN KRISHNA
DUGGARAJU ARAVIND
Advocates, KADAPA.